# నిత్య పెళ్ళికొడుకులు

నేను పుట్టింటి భార్యలు అనే ఎన్నారై కబుర్లు వ్రాసి దాదాపు ఒక సంవత్సరం అయిందేమో. ఆ వ్యాసం వ్రాశాక దానిమీద ఎన్నో ఈ మైల్సు వచ్చాయి. అంతేకాక అమెరికాలోని కొన్ని పెద్ద నగరాలనించీ ఫోన్ కాల్స్ కూడా వచ్చాయి. వాటిల్లో రెండు ఫోన్ కాల్స్ నేను ఎప్పుడూ మరిచిపోలేనివి.

మొదటిది అలబామా రాష్ట్రంనించి. నాకు ఆయన ఎవరో కూడా తెలీదు. ఇండియాలో వాళ్ళ ఊరునించీ ఎవరో ఫోన్ చేసి నాతో మాట్లాడమన్నారుట. అనగా అనగా ఒక అమ్మాయి. ఒక అమెరికాకి కొత్తగా వచ్చిన ఇండియా అబ్బాయిని ఇచ్చి స్వర్గంలో నిర్ణయించిన పెళ్ళి, నెల్లూరులో జరిపించారు. ఆ అబ్బాయి అమెరికాకి తిరిగి వచ్చాడు, భార్యతో కాదు. కోటి రూపాయల కట్నంతో. కాలాలూ, సంవత్సరాలూ మారాయిగానీ, అతనిక్కడ ఆమెక్కడ. భార్యని తీసుకురావటానికి ఏవో సాకులు చెబుతున్నాడు. వీసాకి కూడా అప్లయ్ చేయకుండా ఏవో కబుర్లు చెప్పి నెట్టుకొస్తున్నాడు. నా ఈమెయిల్ ఆంధ్రభూమి ఎన్నారై కబుర్లలో చూసి నన్ను కాంటాక్ట్ చేశారు, అబ్బాయి ఏం చేస్తున్నాడో కనుక్కోమని. అతనితో మాట్లాడకుండానే, అతనికి ఇంకో కోటి రూపాయల పెళ్ళాం వుందని తెలిసింది. నేను లాయర్నీ కాను, కౌన్సెలర్నీ కాదు. అందుకే వాళ్ళడిగిన సమాచారం ఇచ్చి, నాకు తోచిన సలహా ముఖ్యంగా అమెరికాలో లీగల్ సిస్టం ఎలా నడుస్తుందో అన్నీ వివరంగా చెప్పాను.

ఇంకొకరోజు ఎక్కడికో వెళ్ళి ఇంటికి వచ్చేసరికీ, మా ఆన్సరింగ్ మెషీన్‌లో మెసేజ్ వుంది. ఆరిజోనా నించీ ఎవరో అమ్మాయి. మాట్లాడుతూనే వెక్కి వెక్కి ఏడిచింది. తన ఫోన్ నెంబరిచ్చి ఫోన్ చేస్తారా అని అడిగింది. అదెవరో అర్థం కాని నాకు, గాబరా పుట్టి వెంటనే ఫోన్‌చేసి మాట్లాడాను. ఇండియానించీ వదిలేసిన భర్తని వెతుక్కుంటూ తండ్రితో కలిసి వచ్చింది. ఈ నిత్య పెళ్ళికొడుకు ఇంకా మోసగాళ్ళకి మోసగాడు. కోటి రూపాయల కట్నమే కాకుండా, సంవత్సరానికోసారి భారతదేశం వెళ్ళి మన భారతితో పదిరోజులు సంసారం చేసి అమెరికా వచ్చి, అమెరికా భార్యతో పండంటి కాపురం చేసుకుంటున్నాడు.

నేను అడిగింది ఒక్కటే ప్రశ్న, అతనితో తెంచుకోవాలనుకుంటున్నారా, సర్ది చెప్పుకుని కాపురం చేద్దామనుకుంటున్నారా అని. ఆ అమ్మాయి పాతకాలం అమ్మాయి కాదు. మనిషిగా బ్రతకాలనుకుంటున్న ఆశాజీవి. తన జీవితాన్ని, అతని చేతుల్లోనించీ తన చేతుల్లోకి తీసుకోవాలనీ, తను సుఖంగా వుండాలనీ, అతన్ని జైల్లో పెట్టించాలనీ పట్టుదలతో వుంది. ఆమె ఆత్మ విశ్వాసమే ఆమెకు మార్గదర్శి. నేను చేసింది మాట సహాయం, ధైర్యం చెప్పటం మాత్రమే. అసలు విషయం ఏమిటంటే ఇటువంటివి ఇంకా ఎన్నో మిత్రుల అనుభవాల ద్వారా విన్నాను.

ముత్యాలముగ్గు సినిమాలో రావుగోపాలరావ్ నూతన్ ప్రసాద్‌ని ఒరే నిత్య పెళ్ళికొడుకా అని పిలుస్తుంటాడు. సినిమాలో హాస్యంగా వుండేది కానీ, ఈరోజు

నిజజీవితంలో అలాటివాళ్ళని చూస్తానని నేనెన్నడూ అనుకోలేదు. వీళ్ళని అలాటి నిత్య పెళ్ళికొడుకులు అనవచ్చు.

దీనిలో కల్పన ఏమీలేదు. ఒక్క పంజాబ్‌లోనే ఇలా పెళ్ళి చేసుకునే నిత్య పెళ్ళికొడుకులు పదివేలమందికి పైగా వున్నారు. ఆంధ్రదేశంలో దానికి కనీసం రెండు రెట్లు వుంటారని అంచనా! విదేశాలనించీ చాలమంది శనివారం బయల్దేరి సోమవారం ఇండియాకి చేరటం, మంగళ బుధవారాలు అరడజను అమ్మాయిల్ని చూడటం, గురువారం ఒకళ్ళని నిశ్చయించుకోవటం, శనివారం పెళ్ళి చేసుకుని, వెంటనే ఆదివారం ప్రయాణం. ఇదేదో సినిమా కథో, కట్టుకథో కాదు. ఈనాటి భారతంలో విదేశీ వ్యామోహంతో జరుగుతున్న ఇంటింటి కథ. వీటిల్లో చాల సుఖాంతం అవుతున్నా, ఎన్నో దెబ్బతింటున్నాయి కూడాను.

పోయినసారి నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడు ఒక మిత్రుడిని కలిశాను. అతను ఇల్లు కొనుక్కుందామని ఆరు నెల ల్నించీ ప్రయత్నిస్తున్నాడు. ఈ ఏరియా బాగుండదు అదయితే బాగుంటుంది అనీ, ఇక్కడ సేఫ్టీ తక్కువ అక్కడయితే బాగుంటుంది అనీ... రకరకాల కారణాల వల్ల అతనికి పెళ్ళయినా ఇంకా ఒక ఇంటివాడు కాలేదు. అతని భార్య నాతో అంది - 'మాకు రెఫ్రిజిరేటర్ కొనుక్కోవటానికే ఎన్నో రోజులు, ఎంతమందినో ఏది మంచిదో ఏది కాదో కనుక్కుని కొనటానికి మూడు నెలలు పట్టింది. మరి ఇల్లు అంత తొందరపడి ఎలా కొంటాం' అని. నేనూ అంతే కనుక ఆవిడ మాటలు అక్షరాలా సత్యమని ఒప్పుకున్నాను. మరి ప్రేమతో పెంచి పెద్ద చేసిన స్వంత కూతురి విషయంలో, ముక్కూ ముఖం తెలియని పెళ్ళికొడుకుని తలకు మించిన కట్నంతో, అమెరికా అల్లుడనే తప్ప ఇంకేమీ చూడకుండా, హడావిడిగా కొనుక్కునే అవసరం వుందా? అలా చేయటంలో అసలు అర్థమేమిటి? ఇది నాకు ఏమాత్రం అంతుపట్టని ప్రశ్న.

మరి మీరందరూ మీ రోజుల్లో ఎలా పెళ్ళిళ్ళు చేసుకున్నారు బాబూ?

ఆ రోజుల మనుష్యుల స్వభావాలకీ ఇప్పటికీ చాల తేడావుంది. మగ, ఆడ పిల్లలు బాగా చదువుకుంటున్నారు. స్వతంత్ర భావాలతో పెరుగుతున్నారు, ఆర్థికంగా సమానంగా నిలబడగల శక్తి వుంది. అందువల్ల ఈ రోజుల్లో కుదిర్చిన పెళ్ళిళ్ళయినా, ప్రేమ వివాహాలయినా అప్పటికన్నా జాగ్రత్తగా వుండటం అవసరం అంటారు కొంత ఆలోచన వున్నవాళ్ళు ఏమీ ఆలోచించకుండానే.

ఈ వ్యాసానికి ప్రేరణ నేనీమధ్య ఇక్కడ చూసిన ఒక డాక్యుమెంటరీ, 'రన్ ఎవే గ్రూమ్స్'. అది బిబిసివారూ, అమెరికాలో డాక్యుమెంటరీలు తీసేవారూ, ఇండియాలోని కొంతమంది ఇచ్చిన స్పందనతో, సమాచారంతో తీసినది.

అది నమీతా జైన్, సోనియా కౌర్ అనే పుట్టింటి భార్యల కథ. వాళ్ళిద్దరూ సానుభూతి కోసం చూసినవాళ్ళు కాదు. ఇలాటి నిత్య పెళ్ళికొడుకుల గుట్టు ఎలా రట్టు చేయవచ్చో చూపిస్తారు. ఇద్దరు కెనడా పెళ్ళికొడుకుల నిత్య పెళ్ళికొడుకుల అవతారం, దానివల్ల జరిగిన కథ వచ్చేవారం వివరంగా చూద్దాం.

0 0 0